https://teluguislam.net



# అధ్యాయం–9

# 180–188

# 9– ధర్మాన్ని నేర్చుకోవటం మరియు దాన్ని విస్తరింపజేయటం

- అల్లాహ్ తన ప్రియమైన దాసులకు ధర్మ జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు
- ధర్మ జ్ఞానం బోధించేవారిపై అల్లాహ్ తన కారుణ్యాన్ని కురిపిస్తాడు.
- పరస్పరం ఉపన్యాసం చేసుకునే విశిష్టత.
- అల్లాహ్‌కు ప్రియమైన సభ, సమావేశం.

https://teluguislam.net



# 9– ధర్మాన్ని నేర్చుకోవటం మరియు దాన్ని విస్తరింపజేయటం

**అల్లాహ్ తన ప్రియమైన దాసులకు ధర్మ జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు:**

ఖుర్‌ఆన్ మరియు హదీసుల జ్ఞానం దివ్యజ్ఞానం. అల్లాహ్ గురించి మనం ఎంతగా తెలుసుకుంటామో అంతగానే మనకు అల్లాహ్ గొప్పతనం మరియు మహోన్నత గురించి తెలుస్తుంది. దాని కారణంగా మా విశ్వా సం అల్లాహ్ పట్ల మరింత పెరుగుతుంది. ఇంకా మనకు అల్లాహ్ మీద పూర్తి విశ్వాసం మరియు తృప్తి కలుగుతుంది. అందుకనే అల్లాహ్ తఆలా ధర్మజ్ఞానం కలవారికి స్వర్గంలో ప్రత్యేకమైన అంతస్తులు ప్రసాదిస్తాడు.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు:
''జ్ఞానం ప్రసాదించబడినవారి అంతస్థులను అల్లాహ్ పెంచుతాడు. మీరు చేసే ప్రతి పనీ అల్లాహ్‌కు తెలుసు.'' [1]

మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ''అల్లాహ్ ఎవరికయినా మేలు చేయదలుచుకుంటే వారికి ధర్మ జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు...'' [2]

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''అల్లాహ్ దాసులలో జ్ఞాన సంపన్నులు మాత్రమే ఆయనకు భయపడుతారు. నిశ్చయంగా అల్లాహ్ సర్వాధికుడు, క్షమాశీలి.'' [3]

---

[1] (ముజాదలా:11).
[2] (బుఖారీ:69, ముస్లిం:1719).
[3] (సూరతుల్ ఫాతిర్: 28).

https://teluguislam.net



మరొకచోట అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘ఏమీ? విజ్ఞానులు మరియు అజ్ఞానులు సరిసమానులు కాగలరా? వాస్తవానికి బుద్ధిమంతులే హితబోధ స్వీకరిస్తారు.’’ [1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ‘‘(ధర్మ) జ్ఞానం గ్రహించుటకై ఎవరయినా ఒక దారిన పడితే అల్లాహ్ ఆ దారి గుండా అతని కోసం స్వర్గమార్గాన్ని సుగమనం చేస్తాడు.’’ [2]

హజ్రత్ అబూహురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ప్రళయ దినాన ఖుర్ఆన్ (సిఫారసుగా)వస్తుంది, తరువాత ఇలా అంటుంది:

**ఓ నా ప్రభూ!** ‘అతన్ని తొడిగించు’ అప్పుడు అతనికి గౌరవమ్మైన కిరిటాన్ని ధరింపజేస్తారు.

**తరువాత ఆ ఖుర్ఆన్ ఇలా అంటుంది:** ‘ఓ నా ప్రభూ! మరింత ఎక్కువ ప్రసాదించు.’

**తరువాత అతనికి:** ‘గౌరవమ్మైన దుస్తులు ధరింపజేస్తారు.’

**తరువాత ఓ నా ప్రభూ!** ‘ఇతని పట్ల ప్రసన్నుడవు.’

**అలాగే అతనితో (అల్లాహ్):** ‘ప్రసన్నుడవుతాడు.’

**తరువాత అతనితో:** ‘ఖుర్ఆన్ పారాయణం చేస్తూ (స్వర్గం) అంతస్తుల పైకి ఎక్కు, ప్రతి ఆయతుకు బదులు ఒక పుణ్యం (అంతస్తు) ప్రసాదించబడుతుంది’ అని అంటాడు. [3]

---

[1] (సూరతు జుమర్:9).

[2] (సహీహ్ బుఖారీ, బాబుల్ ఇల్మి, ముస్లిం:4867).

[3] (సహీహ్ తిర్మిజీ: 2915, సహీహ్ అల్‌జామే:8030).

https://teluguislam.net



## ధర్మ జ్ఞానం బోధించేవారిపై అల్లాహ్ తన కారుణ్యాన్ని కురిపిస్తాడు:

హజ్రత్ అబూ ఉమామా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రభోదించారు: ''ప్రజలకు మంచి (ధర్మజ్ఞానం)ని బోధించే వారి మీద అల్లాహ్ కారుణ్యాన్ని కురిపిస్తాడు. ఇంకా అల్లాహ్ దూతలు, భూమ్యాకాశాల్లో ఉన్నవారు, చివరికి చీమలు తాముండే రంధ్రంలో నుండి, చేపలు వారి మీద అల్లాహ్ కారుణ్యం వర్షించాలని దుఆ చేస్తూ ఉంటారు.'' [1]

హజ్రత్ సహ్లా బిన్ సఅద్ (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) హజ్రత్ అలీ (రజియల్లాహు అన్హు) గారికి ఇలా హితోపదేశం చేశారు: ''అల్లాహ్ సాక్షిగా! అల్లాహ్ నీ మూలంగా ఏ ఒక్క వ్యక్తికి సన్మార్గాన్ని చూపించినా అది నీ పాలిట ఎరుపు ఒంటెల కన్నా ఎంతో విలువైనది.'' [2]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''సన్మార్గం వైపుకు పిలిచిన వ్యక్తికి అతని పిలుపునందుకొని (సన్మార్గాన్ని) ఆచరించిన వారందరికీ లభించినంత పుణ్యం లభిస్తుంది, దానివల్ల వారి పుణ్యంలోనూ ఎలాంటి తగ్గింపు జరగదు...'' [3]

---

[1] (సహీహ్ తిర్మిజీ: 2685).
[2] (బుఖారీ:2724, ముస్లిం:4420).
[3] (ముస్లిం:4831).

https://teluguislam.net



హ(జ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''మనిషి చనిపోగానే అతని కర్మల పరంపర అంతటితో ఆగిపోతుంది. అయితే మూడు కర్మల పుణ్యం మాత్రం అతనికి (అతను చనిపోయినప్పటికీ) లభిస్తూనే ఉంటుంది. అవి, ఒకటి: శాశ్వతంగా నిలిచిపోయే (సదఖయే జారియా) దానం. రెండవది: తన ప్రజలకు ఉపయోగపడే విద్య. మూడవది: తన శ్రేయస్సు కోసం ప్రార్థించే పుణ్య(కార్యాలు చేసే) సంతానం.''[1]

**ముఖ్య గమనిక:** మనిషి ప్రజల పట్ల ఉపకారిగా మారాలంటే మరియు అతనికి దాని ప్రతిఫలం లభించాలంటే తనకు తాను సరిదిద్దుకుంటూ సమాజంలో ఉన్నవారిని మేలువైపుకు ఆహ్వానించాలి. మరియు చెడుల నుంచి ఆపాలి. అంతటి గొప్పకార్యాలను సాధించాలంటే తను జ్ఞానవంతుడు కావాలి. తరువాత ఆ జ్ఞానాన్ని ఇతరులకు సక్రమంగా బోధించాలి. అప్పుడే మనం ప్రపంచంలో సత్సమాజాన్ని చూడగలుగుతాము. అలా కాదని తమ ఇష్టానుసారం తమ మనోవాంఛల ప్రకారం ప్రజలకు జ్ఞాన ఉపకారం చేయలేరు.

హ(జ్రత్ అమ్ర్ బిన్ ఆస్(రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''నిశ్చయంగా అల్లాహ్ మనుషుల హృదయాల నుండి జ్ఞానాన్ని తీయడు, కాని జ్ఞానులు (విద్వాంసులు) అంతరించిన కారణంగా జ్ఞానాన్ని తీసుకుంటాడు, ఈ విధంగా ఒక్క జ్ఞానవంతుడు కూడా మిగలడు. అప్పుడు ప్రజలు మూర్ఖుల్ని

[1] (ముస్లిం:3084).

https://teluguislam.net



నాయకులుగా చేసుకుంటారు. వారితో ధార్మిక(తీర్పులు) కోరుతారు, వారు తమకు ధర్మజ్ఞానం లేక పోయిన ఫత్వాలు (తీర్పులు) ఇస్తారు. అలా వారు మార్గభ్రష్టత్వానికి గురిఅవుతారు, ఇతరులను కూడా మార్గ భ్రష్టత్వానికి గురిచేస్తారు.'' [1]

## పరస్పరం ఉపన్యాసం చేసుకునే విశిష్ఠత:

మానవత్వం గల ప్రతి మనిషి మంచిని బోధించాలి మరియు చెడు నుండి హెచ్చరించాలి. మన సమాజంలో అనేక మంది చెడు గురించి చెప్పాలన్నా లేక ఎత్తి చూపాలన్నా మనకెందుకులే అన్న భావంతో తప్పుకుంటారు. లేదా ఎవరు ఎలా పోయినా మనకెందుకులే అని ప్రక్కకు జారుకుంటారు. చివరికి ఆ చెడు ప్రభావం మొత్తం సమాజంపై పడుతుంది. మరియు ప్రతి ఒక్కరు దాని కీడును అనుభవించక తప్పదు.

మంచి అంటే ఇస్లామియ ధర్మం దృష్టిలో మంచివిగా పరిగణించబడే అంశాలు. చెడు అంటే ఇస్లామియ ధర్మం దృష్టిలో చెడ్డవిగా భావించబడే విషయాలు. అంతేగానీ ప్రజలు తమ మనోవాంఛలను బట్టి మంచివిగా భావించే ప్రతిదీ మంచిది కాజాలదు. అలాగే ప్రజలు తాము చెడుగా భావించినదల్లా చెడుగా అనిపించుకోదు.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: **''మేలు వైపుకు పిలిచే, మంచిని చెయ్యమని ఆజ్ఞాపించే, చెడుల నుంచి వారించే ఒక వర్గం మీలో ఉండాలి. ఈ పనిని చేసే వారే సాఫల్యాన్ని పొందుతారు.''** [2]

---

[1] (బుఖారీ:98, ముస్లిం:4828).

[2] (సూరతు ఆలి ఇమ్రాన్:104).

https://teluguislam.net



ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''మీలో ఎవరైనా చెడు జరుగుతుండటం చూస్తే దాన్ని చేత్తో ఆపటానికి ప్రయత్నించండి. అంత శక్తి లేకపోతే నోటితోనైనా దాన్ని వారించండి. అదీ చేయలేకపోతే కనీసం మనసులోనైనా దానిని చెడుగా భావించండి. ఇది విశ్వాసపు అతి బలహీన స్థాయి.'' [1]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: 'విశ్వాసం (ధర్మం) అపరిచిత పరిస్థితుల్లో ప్రారంభమయింది. తిరిగి ఆ అపరిచిత పరిస్థితికే పునరావృతమవుతాది. ఆ నాటి అపరిచితులకు శుభవార్త!' అని అన్నారు.

వారెవరూ? అని ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని కొందరు అడిగారు.

దానికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): **'నా తరువాత ప్రజలు చెరిపివేసిన నా సాంప్రదాయాన్ని పునరుద్ధరించేవారు'** అని అన్నారు.[2]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''ఒక విశ్వాసి మరో విశ్వాసికి అద్దం లాంటివాడు, మరియు ఒక విశ్వాసి మరో విశ్వాసికి సోదరుడు. అతనికి అన్ని విధాల అర్థిక సహాయం చేస్తాడు, మరియు అతని వెనుక నుండి కూడా సంరక్షకుడిగా ఉంటాడు.''[3]

---

[1] (ముస్లిం:70).

[2] (అహ్మద్:16094, సిల్‌సిలతుస్ సహీహా:1273).

[3] (సహీహ్ అబూదావూద్: 4918).

https://teluguislam.net



అద్దం మనషికి తన ముహంలో ఉన్న మంచి చెడులను ఏ విధంగా తెలుపుతుందో ఒక నిజమైన ముస్లిం తమ తోటి మిత్రుల తప్పుఒప్పులను తెలుపుతాడు. మరియు వారిని సవరిస్తూ ఉంటాడు. మరియు తమ మిత్రులకు ఏలాంటి కష్టం వచ్చినా శక్తివంచన లేకుండా నిత్యం సహాయపడుతుంటాడు.

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘విశ్వాసులైన పురుషులు, విశ్వాసులైన స్త్రీలు–వారంతా ఒండొకరికి (సహాయకులు, చేదోడువాదోడుగా) మిత్రులుగా ఉంటారు. వారు మంచిని గురించి ఆజ్ఞాపిస్తారు. చెడుల నుంచి వారిస్తారు. నమాజులను నెలకొల్పుతారు, జకాత్‌ను చెల్లిస్తారు. అల్లాహ్‌కు ఆయన ప్రవక్తకు విధేయులై ఉంటారు. అల్లాహ్ అతి త్వరలో తన కారుణ్యాన్ని కురిపించేది వీరిపైనే. నిస్సందేహంగా అల్లాహ్ సర్వాధికుడు, వివేచనశీలి.– విశ్వసించిన ఇలాంటి స్త్రీ పురుషులకు, కాలువలు ప్రవహించే స్వర్గ వనాలను ప్రసాదిస్తానని అల్లాహ్ వాగ్దానం చేశాడు. అక్కడ వారు కలకాలం ఉంటారు. శాశ్వతంగా ఉండే స్వర్గ వనాలలో పరిశుభ్రమైన మేడలు వారి కొరకు ఉంటాయి. వీటన్నింటికీ మించి అల్లాహ్ ప్రసన్నత వారికి లభిస్తుంది. గొప్పసాఫల్యం అంటే ఇదే.’’[1]
స్వర్గవాసులకు స్వర్గంలో ప్రాప్తించే అనుగ్రహాలన్నిటికన్నా అల్లాహ్ ప్రసన్నత రూపంలో లభించే వరం ఎంతో మహత్పూర్వకమైనదై ఉంటుందని హదీసు ద్వారా కూడా రూఢీ అవుతోంది. [2]

---

[1] (సూరతు తౌబా: 71–72).

[2] (అహ్‌సనుల్ బయాన్ తెలుగు: 857).

https://teluguislam.net



## అల్లాహ్‌కు ప్రియమైన సభ, సమావేశం:

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘విశ్వసించిన ఓ ప్రజలారా! మీ సమావేశాలలో (వచ్చేవారికి) చోటు కల్పించండని మీతో అన్నప్పుడు, మీరు జరిగి చోటు కల్పించండి. అల్లాహ్ మీకు విశాలమైన చోటును ప్రసాదిస్తాడు.’’ [1]

ఈ వాక్యంలో ముస్లింలకు సభా మర్యాదలు తెలుపబడ్డాయి. ఇక్కడ సభ (లేక సమావేశం) అనే పదం చాలా విస్తృతార్థం గలది. మంచి ఉద్దేశంతో, పుణ్యం పొందే ఉద్దేశంతో, ఇతరులకు బోధపరిచే సంకల్పంతో నిర్వహించే ప్రతి సభా ఇందులోకి వస్తుంది (తఫ్సీరే ఖుర్తుబీ). ‘ఎడంగా కూర్చోండి’ అంటే మీరు కూర్చున్న సభాస్థలి విశాలంగా ఉండాలి. తరువాత వచ్చిన వారు ఇబ్బంది పడకుండా సర్దుకుని కూర్చు నేలా ముందునుంచే జాగ్రత్తపడాలి. తరువాత వచ్చేవారు నిలబడక తప్పని పరిస్థితిని సృష్టించకూడదు. ముందు వచ్చి కూర్చున్న వారిని లేపి వారి స్థలంలో కూర్చోవటం కూడా మంచి పద్ధతి కాదు. మనసులో చోటు ఉంటే సభలలో కూడా చోటు ఉంటుంది. అందుకే మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: ఎవరయినా ఒక వ్యక్తి మరో వ్యక్తిని లేపి తాను ఆ చోటులో కూర్చోరాదు. ఈ పరిస్థితి రాకుండా ఉండటానికి (ముందుగానే) సభాస్థలిని విశాలంగా ఉంచండి’’ [2]

హ(జ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

---

[1] (58,సూరతుల్ ముజాదిలహ్:11).

[2] (బుఖారీ, ముస్లిం, అహ్సనుల్ బయాన్ తెలుగు:2404).

https://teluguislam.net



‘‘అల్లాహ్ గృహాలలో ఏదైన ఒక గృహంలో కొంత మంది గుమిగూడి అల్లాహ్ గ్రంథాన్ని పారాయణం చేస్తూ, దాని గురించి పరస్పరం చర్చించు కుంటూ ఉంటే వారిమీద ప్రశాంతత అవతరిస్తుంది. అల్లాహ్ కారుణ్యం వారిని కమ్ముకుంటుంది. అల్లాహ్ దూతలు వారిని చుట్టుముడుతారు. ఇంకా వారిగురించి అల్లాహ్ తన ఆస్థానంలోని(దూతల)వద్ద ప్రశంశిస్తాడు.’’[1]

హజ్రత్ అబూహురైరా (రజియల్లాహు అన్హు) కథనం, ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రభోదించారు: ఎవరైనా ఒక సమావేశంలో కూర్చొని ఎన్నో వ్యర్థమైన మాటలు మాట్లాడి, అతను ఆ సమావేశం నుండి లేవక మునుపు ఈపదాలను: **‘‘సుబ్హానకల్లాహుమ్మ వబిహమ్‌దిక అష్‌దు అల్లాహ్ ఇలాహ ఇల్లా అన్‌త, అస్‌తగ్‌ఫిరుక వఅతూబు ఇలైక.’’** చదివినచో ఆ సమావేశంలో జరిగిన పొరపాట్లు క్షమించబడుతాయి. [2]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ‘‘ఏదైనా ఒక సమూహం ఒక సభలో కూర్చొని అక్కడ అల్లాహ్‌ను జ్ఞాపకం చేయనిచో మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)పై **‘దరూద్ దుఆ’** చదవనిచో, ఆ సభవారికి నష్టాన్ని కలిగించడానికి కారణమవుతుంది. ఆయన తలిస్తే వారిని శిక్షించనూ వచ్చు లేదా క్షమించనూ వచ్చు.’’ [3]

---

[1] (ముస్లిం:4867).
[2] (సహీహ్ తిర్మిజీ:3433).
[3] (సహీహ్ తిర్మిజీ: 3380).